సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



తెలంగాణ ఉద్యమ తరహాలో..

తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీలు 42శాతం రిజర్వేషన్ కోసం పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. - IIలో▸



పండుగలకు ప్రత్యేక బస్సులు

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వరంగల్ రీజియన్ పరిధిలో 1,284 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. - IIలో▸

గరిష్టం/కనిష్టం
32.3⁰ /26.1⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోపాలు లేని బిల్లింగ్ విధానం

భూపాలపల్లి రూరల్: విద్యుత్ బిల్లుల అందజేతలో వేగం, మరింత పారదర్శకతను పెంచేందుకు 'ఆటోమేటిక్' మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) వ్యవస్థను రూపొందించామని భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మల్చూర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు లేకుండా ఉండేందుకు ఏఎంఆర్ విధానం ఎంతగానో దోహదపడుతుందని స్పష్టంచేశారు. సర్కిల్‌లో అధిక సామర్థ్యం విద్యుత్ వినియోగించే పరిశ్రమలకు వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పలువురికి గాయాలు

కాటారం: మండలంలోని మేడిపల్లి, మద్దులపల్లి గ్రామాల సమీపంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయాలపాలయ్యారు. భూపాలపల్లి వైపు నుంచి కాటారం వైపుగా వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో కారు డ్రైవర్‌తో పాటు పలువురు గాయాలపాలయ్యారు. మద్దులపల్లి వద్ద రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ప్రయాణికులు గాయాలపాలవగా చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



భూపాలపల్లి అర్బన్: న్యాయవాదులపై వరుసగా జరుగుతున్న భౌతిక దాడులను నిరసిస్తూ శుక్రవారం జిల్లాలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌రావు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ బార్ అసోసియేషన్ సభ్యులు సాయికుమార్, నాంపల్లికి చెందిన హనుమంత్‌నాయక్‌పై భౌతికదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో న్యాయవాదుల రక్షణ చట్టం ప్రవేశపెట్టి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహేందర్, రవీందర్, రాజ్‌కుమార్, రమేష్, రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కార్మికుల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఏరియాలోని కేటీకే ఒకటో గనిలో శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన ఏఐటీయూసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. స్ట్రక్చర్ కమిటీ సమావేశాలలో జరిగిన ఒప్పందాలను అమలు చేయించడంలో గుర్తింపు సంఘం దృష్టి సారించడం లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే నిరసన కార్యక్రమాలు చేపట్టడం కాదని.. పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. వాస్తవ లాభాల వాటా ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ యూనియన్‌ల నుంచి సీఐటీయూలో చేరిన కార్మికులకు రాజిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, బందు సాయిలు, తోట రమేష్, బాబురావు, దేవేందర్ పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరి వరద తగ్గుముఖం పడుతుంది. శుక్రవారం కాళేశ్వరం పుష్కరఘాటు వద్ద 9మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీలో 6.25లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలి వస్తుంది. దీంతో బ్యారేజీలో 85గేట్లు ఎత్తి దిగువకు వరదను తరలిస్తున్నారు. మూడు రోజుల కిందట ఎగువన వర్షాలు కురువడంతో కాళేశ్వరం వద్ద 11.500మీటర్ల ఎత్తులో నీటిమట్టం నమోదు కాగా, మేడిగడ్డ బ్యారేజీలో 9.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలిపోయింది.



మల్హర్ మండలం నాచారంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ధరల భారం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారుల ఇబ్బందులు

- పెరిగిన స్టీలు, సిమెంట్, ఇసుక, కంకర ధరలు
- ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం రూ.5లక్షలు
- అదనంగా రూ. 4 లక్షల వరకు ఖర్చు



భూపాలపల్లి అర్బన్: పెరిగిన స్టీలు, సిమెంట్, ఇసుక ధరలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులపై భారం పడుతోంది. ఇళ్ల నిర్మాణాలు గాడిన పడుతున్న తరుణంలో సామగ్రి రేట్లు అధికం కావడం ప్రతిబంధకంగా మారింది. వీటికి తోడు కంకర, కూలి రేట్లు సైతం పెరిగిపోయాయి. పెరిగిన ధరలను బట్టి ఒక్కొక్క ఇంటిపై రూ.4 నుంచి 5 లక్షల వరకు అదనపు భారం పడేలా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు.

మొదటి విడతలో..

జిల్లాకు మొదటి విడతలో 3,834 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 2,570 ఇళ్ల పనులకు ముగ్గు పోసి పునాదుల దశ పూర్తయింది. ఇందులో 300 మందికి పైగా లబ్ధిదారులకు రూ.లక్ష బిల్లు చెల్లించారు. ప్రభుత్వం విడతల వారీగా లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ దశలను పట్టి రూ.5లక్షల సహాయం అందజేస్తుంది. జిల్లాలోని 12 మండలాల్లో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులు కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.

అందని ఉచిత ఇసుక..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. కానీ ట్రాక్టర్ల యాజమానులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ట్రిప్పు ఇసుకకు రూ.4వేల నుంచి రూ.6వేల వరకు తీసుకుంటూ సరఫరా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందు ట్రాక్టర్ ఇసుక ఏరియాను బట్టి రూ.3వేల నుంచి రూ.4వేల వరకు సరఫరా చేసేవారు. ఇళ్ల నిర్మాణాల నేపథ్యంలో అదునుచూసి ధరలు అమాంతంగా పెంచేశారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. కంకర విషయానికి వస్తే అదే పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో అడ్డా కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇళ్ల నిర్మాణాలతో తాపీ మేస్త్రీ, కూలీలకు చేతి నిండా పని ఉండడంతో కొన్ని ప్రాంతాలలో మేస్త్రీలు దొరకక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మేస్త్రీకి కూలి రూ.600నుంచి 800 ఉండగా ప్రస్తుతం రూ.1000 నుంచి రూ. 1500 వరకు చెల్లించాల్సి వస్తుంది. కూలీలకు రోజుకు రూ.500 నుంచి 600వరకు చెల్లించాల్సి వస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐదు వందలకు పైగా..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 500నుంచి 525 బస్తాల సిమెంట్ అవసరముంటుంది. నెల రోజుల క్రితం బస్తా ధర రూ.280 ఉండగా ప్రస్తుతం గ్రేడ్‌ను బట్టి ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. పాత ధర ప్రకారం రూ.1.47లక్షలు సిమెంట్ ఖర్చు వచ్చేది. ప్రస్తుత రేటును బట్టి బస్తాకు అదనంగా రూ. 50 అదనంగా వేసుకున్న రూ.1.73,250 లక్షలు అవుతుంది. ఈ లెక్కన ఒక్కో లబ్ధిదారుడిపై సిమెంట్ రూపేణ రూ.26,250 వేల వరకు అదనపు భారం పడుతుంది. స్టీల్ ధర కంపెనీని బట్టి గతంలో క్వింటాలుకు కనిష్ఠంగా రూ.5,500 ఉండగా ఇప్పుడు గరిష్ఠంగా రూ.7,800కు చేరింది. ఇంటి నిర్మాణానికి కనీసం 1.5 టన్నుల సిమెంట్ పడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. రూ.5,500 చొప్పున స్టీలుకు రూ.82,500 అవుతుండగా సగటున క్వింటాల్‌కు రూ.7500 చొప్పున రూ.1,12,500 ఖర్చు అవుతుంది. ఈ లెక్కన రూ.37 వేల వరకు అదనపు భారం పడుతుంది.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, పక్కన కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: అనుమతులు లేకుండా ఇసుక రవాణాచేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందిస్తుందన్నారు. కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేపట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. అక్కడక్కడ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, ఈ దందాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే పంచాయతీ కార్యదర్శులు అనుమతులు ఇవ్వాలని సూచించారు. రాజకీయ పలుకుబడులు, ఒత్తిళ్లు ఎన్ని ఉన్నా అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వ్యవసాయ అధికారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మైనింగ్ ఏడీ జయరాజ్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలి..

ప్రణాళిక ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో అదనపు సీఈఓ లోకేష్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి ఐడీఓసీ కార్యాలయం నుంచి పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 24వ తేదీ వరకు స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అబ్బాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ వేగిరం చేయాలి..

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, అసైన్డ్ భూముల విచారణ, భూ భారతి తదితర కీలక అంశాలపై శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

టెండర్ల నిర్వహణ



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో వివిధ షాపులు నడుపుకునేందుకు లైసెన్స్ హక్కుల కోసం ఈ–టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం టెండర్లు రెండవ సారి ఈఓ ఎస్.మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బట్టల షా పు నడుపుకునేందుకు నెలకు రూ.9వేలకు హె చ్చు పాట ద్వార టెండర్ దక్కించుకున్నారు. హోటల్ టెండర్‌కు ఎవరూ పాల్గొనలేదు. దీంతో వాయిదా వేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు



బహుమతులు ప్రదానం చేస్తున్న రాజబాబు

కాళేశ్వరం: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. మహదేవపూర్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జోనల్ స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం హాజరై మాట్లాడారు. ఏ వ్యక్తి అయినా తను ఎంచుకున్న రంగంలో రోజూ ఓ గంట ప్రాక్టీస్ చేస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రకాశ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి, బాలుర పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, బాలికల పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మడక మధు, గ్రీన్‌వుడ్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గుడ్ మార్నింగ్ స్కూల్ కరస్పాండెంట్ సూర్యజిత్, ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ సిరంగి రమేష్, మండల కన్వీనర్ కార్తీక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెకు సిద్ధం



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ధర్నా

భూపాలపల్లి అర్బన్: స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఒప్పంద సమస్యలను సింగరేణి యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ హెచ్చరించారు. సింగరేణి కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోటపలుకుల రమేష్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించి 35శాతం కార్మికులకు వాటా చెల్లించాలన్నారు. కార్మిక సమస్యలు పరిష్కారం కావడం లేదని సీఎండీతో జరిగే స్ట్రక్చర్ మీటింగ్‌లను బహిష్కరించినట్లు చెప్పారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని, సింగరేణిలో నూతన గనులు రావాలని లేదంటే సింగరేణి భవిష్యత్తే ప్రమాదమని తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి రామచందర్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, చంద్రమౌళి, రవికుమార్, విజేందర్, పోశం, కృష్ణమూర్తి, నారాయణ పాల్గొన్నారు.

ఆ 5 శాఖలు...!

అవినీతి ఆరోపణల్లో ముందు వరుస

- తీరు మారని పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా, విద్యుత్ శాఖలు
- ఏసీబీకి చిక్కుతున్నా వీడని ఆయా శాఖల అధికారుల కక్కుర్తి
- కాసుల కోసం అడ్డదారులు.. అక్రమార్జనే ధ్యేయంగా పనులు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో వీరిపైనే అధిక ఫిర్యాదులు
- నీటిపారుదలశాఖ అధికారులపైన పెరిగిన దాడులు

ఐదేళ్లలో ఏసీబీ కేసులు ఇలా..

సంవత్సరం	కేసుల సంఖ్య
2021	07
2022	09
2023	11
2024	17
2025 (ఆగస్టు 31 వరకు)	12



సాక్షిప్రతినిధి, వరంగల్ : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు ముమ్మరమైనా.. కొందరు అధికారులు, ఉద్యోగుల్లో మార్పు లేదు. లంచం.. లంచం.. లంచం.. ఈ పదం కొన్ని శాఖల్లో సర్వసాధారణంగా మారింది. అవసరం కొద్ది లంచం ఇవ్వడం.. అధికారులు తీసుకోవడం అనివార్యంగా మారుతోంది. హద్దులు దాటి అధికంగా డిమాండ్ చేసినప్పు డు... బాధితులు ఏసీబీని ఆశ్రయించడం పరిపాటిగా మారుతోంది. ఈ క్రమంలో ఇటీవలి కాలంలో ఉమ్మడి జిల్లాలో పలువురు అధికారులు ఏసీబీకి చిక్కుతుండడం చర్చనీయాంశంగా మారుతోంది. ప్రధానంగా రెవెన్యూ, రవాణా, పోలీసు, రిజిస్ట్రేషన్, విద్యుత్‌శాఖల్లో పెచ్చుమీరిన అవినీతి కొందరికి శాపంగా మారుతోంది. కాళేశ్వరం వివాదం తర్వాత నీటిపారుదలశాఖలో పనిచేసే అధికారులు కొందరు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో కటకటాల పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ఉమ్మడి వరంగల్‌లో అవినీతి, అక్రమాలు యథాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి.

పెరుగుతున్న ఫిర్యాదులు..
అవినీతి పరులపై ఆరా..

అవినీతి, అక్రమార్కులపై ఏసీబీ దూకుడు పెంచడంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, పోలీసు, రవాణా, రిజిస్ట్రేషన్, విద్యుత్‌శాఖలతో పాటు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, 'కుడా'లలోని పలు విభాగాల్లో కొందరు అధికారులపైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ పనికి ఓ రేటును ఫిక్స్ చేసి మధ్యవర్తుల ద్వారా వసూలు చేస్తున్న ఉదంతాలు బయటపడుతున్నాయి. ప్రధానంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని కొందరు పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లపైన భూదందాలు, సెటిల్‌మెంట్ల పేరిట భారీగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారుల కోసం భూసేకరణ, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్‌ల పేరిట రెవెన్యూ అధికారుల వసూళ్లు వివాదాస్పదమవుతున్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, ఎఫ్‌టీఎల్ స్థలాలు, ఎల్‌ఆర్‌ఎస్ లేని నాన్ లేఅవుటు ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తూ భారీగా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుల కొందరు సబ్ రిజిస్ట్రార్లపైన ఉన్నాయి. అదే విధంగా విద్యుత్ శాఖలో కొందరు అధికారులు బినామీలను పెట్టుకుని కాంట్రాక్టులు చేస్తుండడంతో పాటు విద్యుత్ కనెక్షన్లు, సదుపాయాల కల్పనకు పెద్ద మొత్తంలో లంచాలు డిమాండ్ చేస్తుండడం వివాదాస్పదమవుతోంది. డీటీఓ కార్యాలయాల్లో హద్దులు దాటిన అవినీతిపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నా ఏసీబీ అధికారులు మౌనం వహించడంపై చర్చ జరుగుతోంది. జీడబ్ల్యూఎంసీ, కుడాలలో కొందరు అవినీతి అధికారులపైన బాధితులు ఏసీబీని సంప్రదించినట్లు చెప్తున్నారు. ఏదేమైనా ఏసీబీ దూకుడుతో రోజురోజుకూ అవినీతికి పాల్పడే వారిపై ఫిర్యాదులు వెల్లువెత్తడం కలకలం రేపుతోంది.

వరుస సంఘటనలు..
తీరుమారని అధికారులు..

ఉమ్మడి వరంగల్‌లో వరుసగా కొందరు అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కుతున్నారు. మరికొందరు ఆదాయానికి మించిన ఆస్తుల ఫిర్యాదులతో దాడులకు గురవుతున్నారు. ఆగస్టులో ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపి, అక్రమాస్తులను గుర్తించారు. ఫిబ్రవరిలో వరంగల్ రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్‌పై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి, సోదాలు నిర్వహించారు. అంతకుముందు ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో ఈఈగా పని చేస్తున్న నూనె శ్రీధర్‌పైన ఏసీబీ దాడులు నిర్వహించి రూ.200 కోట్ల వరకు ఆస్తులను గుర్తించినట్లు ప్రకటించింది. ఇదిలాఉంటే మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సీఐ జగదీష్ ఓ బెల్లం వ్యాపారానికి సంబంధించి రూ.4లక్షలు డిమాండ్ చేసి లంచం తీసుకున్న కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలోని ఏఈ రమేష్, ఆయన అసిస్టెంట్ రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఓ కేసు నుంచి నిందితులను తప్పించేందుకు లంచం తీసుకున్న పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్నను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం రూ.19,200 తీసుకుంటుండగా మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్‌ను అప్పట్లో ఏసీ బీ అధికారులు పట్టుకున్నారు. మహబూబాబాద్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గౌస్ పాషా ఇంట్లో ఏసీబీ తనిఖీలు నిర్వహించి అక్రమాస్తులను గుర్తించారు. విద్యుత్‌శాఖ హైదరాబాద్‌లో పనిచేసే ఏడీఈ అంబేద్కర్‌పై ఏసీబీ దాడులు, వెల్లడైన అక్రమాస్తుల నేపథ్యంలో ఆశాఖ అధికారులపైన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఉమ్మడి వరంగల్‌లో వరుసగా ఏసీబీ దాడులు, కేసులు అవుతున్నా ఆ ఐదు శాఖల్లోని కొందరు అధికారుల్లో మార్పు రాకపోవడంపై చర్చ జరుగుతోంది.

ఆర్డీఓ కార్యాలయ జప్తునకు కోర్టు ఆదేశాలు

భూపాలపల్లి అర్బన్: ఆర్డీఓ కార్యాలయ జప్తునకు జిల్లా కోర్టు ఆదేశాలు జారీచేయడంతో శుక్రవారం సిబ్బంది వచ్చి సామగ్రిని సీజ్ చేశారు. కొత్తపెల్లి, చిన్నకొడెపాక గ్రామానికి చెందిన కుంటపల్లి విజయలక్ష్మి, పెండ్యాల వసంతలక్ష్మిలకు సంబంధించిన 11.20 ఎకరాల వ్యవసాయ భూమిని 1988లో ఎన్టీఆర్ నివేశస్థలాల కోసం ప్రభుత్వం తీసుకుంది. ఎకరానికి రూ.17వేలు నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు చెప్పారు. ఎకరానికి రూ.5వేల చొప్పున కొంత మేరకు నష్టపరిహారం చెల్లించారు. మిగితా నష్టపరిహారం కోసం బాధితులు కోర్టును ఆశ్రయించారు. రెండు నెలల క్రితమే బాధితులకు రావాల్సిన నష్టపరిహారం సొమ్ము వడ్డీ కలిపి మొత్తం రూ.22,65,253 చెల్లించాలని కోర్టు ఆదేశించింది. పరిహారం ఇవ్వని పక్షంలో కార్యాలయంలోని ఫర్నిచర్, వాహనాలు, ఇతర సామగ్రి జప్తు చేయాలని కోర్టు సూచనల మేరకు బాధితులు, కోర్టు సిబ్బంది ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి కార్యాలయం ఆస్తులు జప్తు చేస్తామని ఆర్డీఓతో కోర్టు సిబ్బంది చెప్పారు. ఆర్డీఓ రవి కొద్ది రోజులు గడువు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలోనే శుక్రవారం మళ్లీ రెండో సారి కోర్టు సిబ్బందితో పాటు బాధితులు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలోని ఫర్నిచర్, ప్రింటర్లు, కుర్చీలు, బీరువాలు తదితర 54 రకాల సామగ్రిని సీజ్ చేశారు. కోర్టు ద్వారా తమ సమస్యను పరిష్కరించుకుంటామని ఇన్‌చార్జ్ ఆర్డీఓ మయాంక్‌సింగ్ తెలిపారు. 37ఏళ్ల క్రితం జరిగిన నష్టపరిహారం చెల్లింపు విషయాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి, బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



కాటారం–మంథని రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: యూరియా దిగుమతి అయినా పంపిణీ చేయడం లేదని ఉదయం వచ్చి పడిగాపులు కాస్తున్నామని ఆరోపిస్తూ శుక్రవారం రైతులు పీఏసీఎస్ గోదాం ఎదుట కాటారం–మంథని రహదారిపై ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారిపై వాహనాలను నిలిపివేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ యూరియా దిగుమతి అయినప్పటికీ డీఓ రాలేదనే కారణంతో పీఏసీఎస్ అధికారులు పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. యూరియా కోసం వ్యవసాయ పనులు వదిలిపెట్టుకొని వచ్చి ఎదురుచూస్తున్నా తమ బాధ ఎవరికీ పట్టడం లేదన్నారు. యూరియా పంపిణీ చేసేంత వరకు ఆందోళన విరమించుకునేది లేదని భీష్మించారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు మద్దతు తెలిపారు. కాటారం–మంథని రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్, ఏఈఓ రాజన్న ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులకు ఒక్కో బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయించారు.

క్లుప్తంగా

నిట్‌లో రూ.650 కోట్లతో రీసెర్చ్ పార్క్

- గాటీ శక్తి విశ్వవిద్యాలయ వీసీ మనోజ్‌చౌదరి



పాల్గొన్న మనోజ్‌చౌదరి, తదితరులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు రూ.650 కోట్ల నిధులతో రీసెర్చ్‌పార్క్‌ను త్వరలో నిర్మించనున్నట్లు గుజరాత్‌లోని గాటీ శక్తి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ మనోజ్‌చౌదరి తెలిపారు. నిట్ వరంగల్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెండు రోజుల సెకండ్ రీసెర్చ్ స్కాలర్స్ పోస్టర్స్ ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా మనోజ్‌చౌదరి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. సమాజానికి తోడ్పడే పరిశోధనలపై పీహెచ్‌డీ స్కాలర్లు దృష్టి సారించాలని, నూతన పరిశ్రమల స్థాపనకు రీసెర్చ్ పార్క్ తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, ప్రొఫెసర్ రవిశంకర్, వెంకయ్య చౌదరి, పీహెచ్‌డీ స్కాలర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



హన్మకొండ : బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. తెలంగాణలో అతి ముఖ్యమైన ఈ పండుగలకు వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు స్వగ్రామాలకు వస్తారు. ఈ క్రమంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. వరంగల్ రీజియన్‌లో మొత్తం 1,284 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం డి.విజయభాను శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి ఉప్పల్, పరకాల, భూపాలపల్లి, కాళేశ్వరం, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూర్, జనగామ నుంచి ఉప్పల్‌కు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు వివరించారు. హనుమకొండ డిపో నుంచి 235, వరంగల్ -1 డిపో 228, వరంగల్ -2 డిపో 104, జనగామ 197, మహబూబాబాద్ 77, నర్సంపేట 166, పరకాల 138, తొర్రూరు 66, భూపాలపల్లి డిపో ద్వారా 72 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వివరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అప్పటికప్పుడు బస్సులను సమకూర్చి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

సమస్యలుంటే నేరుగా కలవండి

- జూమ్ మీటింగ్‌లో టెమ్రిస్ సెక్రటరీ

న్యూశాయంపేట: సమస్య పరిష్కారానికి ఉద్యోగులు తనతో నేరుగా సంప్రదించాలని, ధర్నాలతో సమస్యలు పరిష్కారం కావని, సామరస్యంతో పరిష్కరించుకుంటే సత్ఫలితాలు ఉంటాయని తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యాసంస్థలు(టెమ్రిస్) సెక్రటరీ బి.షఫియుల్లా అన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని టెమ్రిస్ అధికారులు, ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఆందోళనలు చేపట్టి టెమ్రిస్ ఇమేజ్ దెబ్బతీయొద్దని హితవు పలికారు. తాను తిరిగి సెక్రటరీ బాధ్యతలు చేపట్టిన రెండునెలల కాలంలోనే 317 జీఓతోపాటు, టైం టేబుల్ మార్పు పలు సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ మీటింగ్‌లో ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్, విజిలెన్స్ అధికారులు, ప్రిన్సిపాళ్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

కాజీపేటలో చైన్ స్నాచింగ్

- 6 తులాల బంగారు ఆభరణాల అపహరణ

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ మాత కిరాణం గల్లీలో శుక్రవారం రాత్రి ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. బాధితురాలి కథనం ప్రకారం.. రిటైర్డ్ పోలీసు అధికారి సతీమణి రౌతు శిరీష తన ఇంటి పక్కన ఉండే బంధువుతో కలిసి రహదారిపై వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికెళ్తున్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై ముఖానికి మంకీ క్యాపు ధరించిన వ్యక్తి ఆకస్మికంగా దాడి చేసి మెడలోని బంగారు నగలను అపహరించాడు. సదరు మహిళ తేరుకుని కేకలు వేసే లోపే నిందితుడు పరారయ్యారు. దాదాపు 6 తులాల బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించడంతో శిరీష కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. దీంతోపాటు మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీమెట్టు రామలింగేశ్వర స్వామి కాలనీ రోడ్డు-1లో అదే సమయంలో మరో మహిళ మెడ నుంచి గొలుసు అపహరించడానికి ప్రయత్నించగా మహిళ ఎదురు తిరగడంతో నిందితుడు పారిపోయినట్లుగా చెబుతున్నారు. మడికొండ పోలీస్‌స్టేషన్ పోలీసులు విచారణ ప్రారంభించారు.

సర్కార్ బడి @ 75

- ప్రైవేట్‌కు దీటుగా డిజిటల్ బోధన
- ఒకే ప్రాంగణంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు
- ప్రస్తుతం 741 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతి గదులు, ప్రాంగణం

డైమండ్ జూబ్లీకి చేరిన కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల



పాఠశాల ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పాఠశాల ప్రాంగణం

ఖిలా వరంగల్: వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఉన్నత పాఠశాల ప్రారంభించి 75 ఏళ్లు పూర్తయింది. 1950లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలగా ప్రారంభించిన ఈ బడి ఏడాది తిరగక ముందే పాథమికోన్నత పాఠశాలగా మార్పు చేసి ఉర్దూతోపాటు తెలుగులోనూ బోధన ఆరంభించారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. 2025 జూన్ 11 నాటికి 74 వసంతాలు పూర్తి చేసుకొని 75వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ప్రధానోపాధ్యాయురాలు రావూరి మాధవి ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో వనమహోత్సవాన్ని నిర్వహించి విరివిగా మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచారు.

సకల వసతులు..

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హెచ్‌ఎం మాధవి చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో 472 మంది చదువుతుండగా.. ప్రైవేట్‌కు ధీటుగా అధునాతన సౌకర్యాలు, 16 మంది ఉపాధ్యాయులు, తొమ్మిది మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో 269 మంది విద్యార్థులు చదువుతుండగా 8 మంది ఉపాధ్యాయులు ఎనిమిది తరగతి గదుల్లో చక్కటి విద్యను అందిస్తున్నారు. ఒకే ప్రాంణంలో నిర్వహిస్తోన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 741 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా.. ప్రతితరగతి గదితోపాటు పాఠశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు డిజిటల్ విధానంలో బోధన అందిస్తున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో బోధన కొనసాగుతోంది.

బడిబాటతో వందలాదిమంది చేరిక

ప్రైవేట్‌కు ధీటుగా కొనసాగుతోన్న ఈ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తోన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవి బాధ్యతలు చేపట్టిననాటి నుంచి భవితకు బాటలు వేస్తున్నారు. బడిబాట వంటి కార్యక్రమాల ద్వారా వందలాది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. పిల్లలు ఆహ్లాదకర వాతావరణంలో ఆంగ్ల మాధ్యమంలో ఆనందంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కరీమాబాద్ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు ఆలోచించే స్థాయిలో ఈపాఠశాల నిర్వహణ, బోధన ఉండేలా హెచ్‌ఎం చర్యలు చేపడుతున్నారు.



డిజిటల్ బోర్డుపై పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం మాధవి

టెన్త్ ఫలితాల్లో జిల్లాస్థాయి ర్యాంక్ సాధించి విద్యాశాఖ అధికారులతో ప్రశంసలు అందుకున్నారు. దీంతోపాటు ఆకుకూరలు, పప్పులతో కూడిన మధ్యాహ్న భోజనం.. వారానికి మూడు రోజులు కోడి గుడ్లు, ఉదయం రాగిజావ అందజేస్తున్నారు.

సౌకర్యాలు ఇలా...

పాఠశాలలో విశాలమైన మైదానం, ప్రయోగశాలలు, డిజిటల్ తరగతుల ద్వారా విద్యాబోధన జరుగుతుంది. విద్యార్థులకు వ్యాయామం, క్రీడాపోటీల్లో తర్ఫీదునిస్తున్నారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కబడ్డీలో వర్షిత, కళావాస్తవ త్రీడి ఆర్ట్స్‌లో అక్షయ్ రాణించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. పది తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్, ప్రత్యేక కంప్యూటర్ గది ఉన్నాయి. డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో ఉచితంగా నోట్ బుక్కులు, పెన్నులు, బ్యాగులు, సైకిళ్లు అందజేయడంతో దూరప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం పాఠశాల చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం



ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. గత ఏడాది కన్న ఈఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచాం. రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు ప్రతీ విద్యార్థికి యూనిఫాం అందించాం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మా పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు.

- రావూరి మాధవి, ప్రధానోపాధ్యాయురాలు

డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలి



కేయూ క్యాంపస్: కేయూ పరిధి డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు శుక్రవారం ఫీజు నోటిఫికేషన్‌ను శుక్రవారం వర్సిటీ అధికారులు తెలిపారు. అపరాధ రుసుం లేకుండా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అక్టోబర్ 15 వరకు గడువు ఉందని, రూ.50 అపరాధ రుసుంతో అక్టోబర్ 22 వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడాలని అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ పి.వెంకటయ్య తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు సుమన్



కేయూ క్యాంపస్: మలేషియాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ మరాలో ఈనెల 18 నుంచి ప్రారంభమై 20 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల పరిశోధకుడు నమిలే సుమన్ పాల్గొంటున్నారు. ఈసదస్సులో 'ఎఫెక్ట్ ఆఫ్ మెథడ్స్ ఆన్‌ట్రిబల్ అండ్ నాన్‌ట్రిబల్ యూనివర్సిటీ అథ్లెటిక్స్' అంశంపై ఆయనే తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. నమిలే సుమన్ కేయూలోనే బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నారు. అథ్లెటిక్స్‌లో ఇప్పటికే విశేష ప్రతిభను కనబర్చారు. పలు మెడల్స్ కూడా సాధించారు.

21 నెలల్లో రూ.1,025.45 కోట్ల పనులు

- విద్య, వైద్య, సాగు నీటికి ప్రాధాన్యం
- రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు స్టేషన్ ఘనపూర్ ప్రజలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హన్మకొండ: కాంగ్రెస్ ప్రభుత్వంతో పని చేస్తున్న 21 నెలల కాలంలో రూ.1,025.65 కోట్లతో 27 ముఖ్యమైన పనులు మంజూరు చేయించానని, ఇంత పెద్ద మొత్తంలో ఏ నియోజకవర్గానికి కూడా నిధులు మంజూరు కాలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులపై కూడా చాలా మంది చాలా రకాలుగా విమర్శలు చేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డి వచ్చి రూ.800 కోట్ల పనులకు శంకుస్థాపన చేస్తే 8 పైసలు రాలేదనడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ అభివృద్ధి పనులన్నీ 2024 జనవరి తర్వాతనే మంజూరయ్యాయని స్పష్టం చేశారు. తేదీ వారీగా వివరాలు వెల్లడించారు. సాగునీటి రంగం, విద్య, వైద్యానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. గోదావరి నీళ్ల ప్రతి గ్రామానికి చేరేలా కాల్వలు అభివృద్ధి చేశానని చెప్పారు. 80 శాతం గ్రామాలకు గోదావరి నీరు అందుతుందన్నారు. రూ.1,015 కోట్లతో దేవాదుల ప్రాజెక్టులోని కాల్వలన్నీ బాగుచేశామని వివరించారు. జఫర్‌గఢ్ మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్టేషన్ ఘనపూర్‌లో డిగ్రీ కళాశాల, చిల్పూరుకు ఐటీఐ మంజూరు, వేలేరు మండలం పీచరలో 132/33 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించానని వివరించారు. ఈ సబ్ స్టేషన్‌ను ఈ నెలాఖరులో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, అదే విధంగా 220/33 కేవీ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లింగాల జగదీష్‌రెడ్డి, కరుణాకర్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాడాలి

- బీసీలపై అగ్రవర్ణ రాజకీయ పార్టీల వైఖరి మారాలి
- నవంబర్ 9న లక్షమందితో యుద్ధభేరి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట రూరల్: తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీలు 42 శాతం రిజర్వేషన్ కోసం సంఘటితమై పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ అధ్యక్షతన కాజీపేటలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలపై అగ్రవర్ణ రాజకీయ పార్టీల వైఖరి మారకుంటే పార్టీలు, జెండాలకతీతంగా బీసీ కుల సంఘాలన్నింటిని ఏకతాటిపైకి తీసుకొచ్చి అగ్రవర్ణ పార్టీల భరతం పడతామని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఆమోదించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. బీసీ ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు నవంబర్ 9న భువనగిరిలో లక్షమందితో బీసీల రాజకీయ యుద్ధభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ కులాల జేఏసీ అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్, బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరంగల్ శ్రీనివాస్‌యాదవ్, బీసీ విద్యార్థి సంఘం కేంద్రకమిటీ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనుకాల శ్యామ్ కురుమ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మనిమంజరి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోడుగు మహేష్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, నాయకులు మల్లయ్యయాదవ్, యాదగిరిగౌడ్, సమ్మయ్య, రాజుగౌడ్, సంగాని మల్లేశ్వర్, మహేందర్‌గౌడ్, నాగరాజ్, సురేష్, అశోక్‌గౌడ్, శోభారాణి, పద్మజాదేవి, అరుణ, సుగుణ, కిషోర్ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి



ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో శుక్రవారం ఆ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించినన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళా సందర్భంగా ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాలో 16 కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాలలో ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఇకముందు వివిధ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకొని విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ అందించేదిశగా కృషిచేస్తామన్నారు. కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ జితేందర్, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు వరలక్ష్మి, పీ.సరిత, ప్రవీణ్, ఎ.సరిత పాల్గొన్నారు. డిగ్రీ కోర్సులతోపాటుగా బీటెక్, ఫార్మసీ విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

'వేతనాలు ముందే ఇవ్వాలి'

హన్మకొండ: బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులకు ముందే వేతనాలు ఇవ్వాలని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ కోరారు. ఈమేరకు తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లకు లేఖ రాశారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. తెలంగాణలో అతి ముఖ్యమైన పండుగ బతుకమ్మ, దసరా అని, ఈ పండుగకు అవసరాలు తీర్చుకునేందుకు ఖర్చులు పెద్ద మొత్తంలో అవసరమవుతాయన్నారు. ఈనెల 27లోపు జీతాలు విడుదల చేయాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలను కోరారు.

'పీఎంవీబీఆర్‌వై'ని వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్: ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పథకాన్ని అవసరమైన ఉద్యోగులు, యజమాన్యాలు వినియోగించుకోవాలని వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్- 2 వైడీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి అవకాశాల పెంపు, యువతలో ఉపాధి సామర్థ్యాల అభివృద్ధి, సామాజిక భద్రతను మెరుగుపర్చడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని వెల్లడించారు. ఈపథకం ద్వారా కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి నెల వేతనం (గరిష్ఠంగా రూ.15 వేలు) రెండు విడతలుగా ఖాతాల్లో జమ చేస్తారని, తయారీ రంగ యజమానులకు ప్రతీ ఉద్యోగిపై నెలకు రూ.3 వేల ప్రోత్సాహకం అందుతుందని తెలిపారు. అయితే యజమానులు ఎంప్లాయర్ పోర్టల్‌లోని పీఎంవీబీఆర్‌వై లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు వరంగల్‌లోని పీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆభరణాలపై హెచ్‌యూఐడీ కోడ్ ముద్రించాలి

- వినియోగదారుల మండలి ప్రతినిధులు

ఖిలా వరంగల్: బంగారు ఆభరణాలపై నాణ్యత తెలిసేలా హెచ్‌యూఐడీ కోడ్‌ను తప్పనిసరిగా ముద్రించాలని, కొనుగోలు సమయంలో హెచ్‌యూఐడీ కోడ్‌ను పరిశీలించిన తర్వాతే ఆభరణాలు కొనాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సౌత్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్ సూచించారు. చెన్నైలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో బంగారు ఆభరణాలపై జరుగుతున్న మోసాలపై డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం వారు అందజేసి మాట్లాడారు. వరంగల్‌పాటు ఇతర జిల్లాలో బంగారు ఆభరణాల నాణ్యతపై మోసాలు జరుగుతున్నాయన్నారు. వ్యాపారులు అమ్మకం రశీదులపై నాణ్యతను గుర్తించే డిజిటల్ హెచ్‌యూఐడీ నంబర్ ముద్రించడం, రాయడం లేదన్నారు. హనుమకొండలోని రెండు కార్పొరేట్ స్థాయి ఆభరణాల సంస్థలపై వరంగల్ వినియోగదారుల కోర్టులో విచారణ సాగుతుందని వివరించారు. కార్యక్రమంలో వినియోగదారుల మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి..

- ఇద్దరిపై కేసు నమోదు
- కేసముద్రంలో ఘటన



గాంధీసెంటర్‌లో బస్సు వద్ద గుమిగూడిన జనం

కేసముద్రం: ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటన కేసముద్రంలోని గాంధీసెంటర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ డిపో నుంచి వరంగల్ వైపునకు బయల్దేరిన ఆర్టీసీ బస్సు.. కేసముద్రంస్టేషన్‌లోని బడితండా సమీపంలో ఆపకుండా డ్రైవర్ ఎప్పటిలాగే గాంధీసెంటర్ వద్ద ఆపాడు. ఇంతలో బడితండాకు చెందిన భిక్షపతి అనే వ్యక్తి బైక్‌పై వచ్చి.. డ్రైవర్ విష్ణుమూర్తితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో డ్రైవర్ బస్సు నుంచి కిందకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతున్న క్రమంలో బడితండాకు చెందిన మహేందర్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి.. డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో సదరు డ్రైవర్ బస్సును పోలీస్‌స్టేషన్ వరకు తీసుకొచ్చి ఆ ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కాంగ్రెస్ యూత్ నాయకుడి మృతి



వినోద్ మృతదేహం

రాయపర్తి/ఖిలావరంగల్: వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఏకే తండాకు చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు మూడ్ వినోద్ (25) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వినోద్ వరంగల్ పట్టణం కరీంబాద్‌లోని ఉర్సు గుట్ట సమీపంలో విద్యుత్ సరఫరా మరమ్మతులు చేపడుతుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం నగరంలోని మెడికేర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వినోద్ మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ తొర్రూరు బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మర కల్యాణ్‌గౌడ్, మండల పార్టీ నాయకులు బాధ్య నాయక్, సోమనాయక్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

రెండో రాజధానిగా వరంగల్

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

హన్మకొండ: వరంగల్‌ను రెండో రాజధానిగా ఏర్పాటు చేయడం తమ పార్టీ విధానమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చెప్పారు. హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రకార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విలేకరుల సమావేశంలో తీన్మార్ మల్లన్న వెల్లడించారు. తెలంగాణ అనే పదాన్ని ఇష్టపడని బీఆర్‌ఎస్ ఆ పదాన్ని వదిలేసి తెలంగాణ అస్థిత్వానికి దూరమైన క్రమంలో ఆ అస్థిత్వాన్ని తమ భుజాల మీద ఎత్తుకున్నట్లు తెలిపారు. భూమిలేని బీసీ కుటుంబాలకు 2 ఎకరాల చొప్పున ఇస్తామన్నారు. అగ్రవర్ణాల పేదలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. సచార్ కమిటీ నివేదికను అమలు చేసి మైనార్టీల అభివృద్ధి, జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. జనాభా దామాషా ప్రకారం ఫలాలు అందాలన్నదే తమ విధానమని, ఈ మేరకు రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేస్తామని స్థానికతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఒక్కరికీ కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వైద్యం అందిస్తామని, మహిళల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలు ప్రాధాన్యత అంశం కాదని, ముందుగా విద్య, ఉద్యోగాల్లో 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు సూదగాని హరిశంకర్ గౌడ్, రజనీకుమార్, ప్రధాన కార్యదర్శులు వట్టె జానయ్య, సూర్యారావు, నాయకులు పల్లె బోయిన అశోక్, మదన్ మోహనచారి, ప్రసన్న, భావన, జ్యోతి పాండల్, మధు, పాషా మనోజ్, ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నెక్కొండ : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నెక్కొండ- కేసముద్రం ప్రధాన రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఖానాపురం మండలంలోని బోటిమీది తండాకు చెందిన గుగులోతు ధన్యా (47) బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధన్యా అక్కడికక్కడే మృతి చెందగా అతడి సోదరుడు ఈర్యా గాయాలపాలయ్యాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

మైలారంలో..

రాయపర్తి : మైలారంలో లారీ ఢీకొని గ్రామానికి చెందిన గట్ల సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణ నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు విచారణ చేపట్టారు.

కొడుకును చంపిన తండ్రికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : మానసిక, శారీరక దివ్యాంగుడైన కొడుకును పోషించలేక హత్య చేసిన నేరంలో మృతుడి తండ్రి తాళ్లపెల్లి పున్నంచందుకు జీవిత ఖైదు, రూ.11 వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి అపర్ణదేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఈతీర్పునకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి పున్నంచందుకు 15 సంవత్సరాల క్రితం రమాదేవితో వివాహం జరిగింది. వీరికి జన్మించిన కుమారుడు శివసాయి (12) పుట్టుకతోనే శారీరక, మానసిక దివ్యాంగుడు. పున్నంచందు మద్యానికి బానిస కావడం, కుమారుడి అనారోగ్య ఇబ్బందులతో రమాదేవి ఇరువురిని వదిలేసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి పున్నంచందు, శివసాయిలను పున్నంచందు తల్లి సుజాత పోషించేది. ఈ క్రమంలో మద్యానికి డబ్బుల కోసం పున్నంచందు సుజాతను నిత్యం కొట్టి, తిట్టేవాడు. పున్నంచందు వేధింపులు భరించలేక 2023 మార్చిలో సుజాత భీమారంలోని తన కూతురు ఇంటికి వెళ్లిపోయింది. అప్పుడప్పుడు వచ్చి మనువడు శివసాయిని చూసి వెళ్లేది. ఎప్పటిలాగే ఏప్రిల్ 20, 2023న మనువడిని చూడటానికి సుజాత ఇంటికి వచ్చింది. దీంతో పున్నంచందు తన తల్లితో మాట్లాడుతూ.. అంగవైకల్యంతో నిత్యం ఏడుస్తూ చికాకు కల్పించినందున భారమని భావించి శివసాయిని రెండు రోజుల క్రితమే చంపానని, మృతదేహం ఇంట్లోనే ఉందని, సహకరిస్తే ఎవరికీ తెలియకుండా మృతదేహాన్ని తరలిద్దామని తల్లికి చెప్పాడు. సుజాత ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తం మడుగులో శివసాయి మృతదేహం ఉంది. దీంతో పున్నంచందుకు నుంచి తప్పించుకుని పోలీసులకు సమాచారమిచ్చింది. ఈ విషయం తెలిసిన పున్నంచందు అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు గాలిస్తున్నారని తెలిసి గ్రామ పెద్దల సాయంతో ఏప్రిల్ 29, 2023న పోలీసుల ఎదుట లొంగిపోయాడు. హత్యా నేరం కింద కేసు నమోదు చేసిన కేయూసీ పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు హత్యానేరం రుజువుకావడంతో పున్నంచందుకు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. కేసును పోలీస్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, దయాకర్ పరిశోధించగా.. లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి విచారణ పర్యవేక్షించారు. యూనివర్సిటీ కానిస్టేబుల్ రాజేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ బొల్లెద్ల రాజమల్లారెడ్డి కేసు వాదించారు.



‘రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, మనం ఉదయం లేవగానే చేసే పనులు కీలకపాత్ర పోషిస్తాయి. నిద్ర లేచిన కొద్దిసేపటికే నెగటివ్ థాట్స్, చేదు జ్ఞాపకాలు దూసుకు రావచ్చు. అవి మదిలో చేరిన వెంటనే డిలీట్ చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి. వ్యాయమాలు, క్రియేటివ్ వర్క్‌పై దృష్టి పెట్టాలి’ అని అంటున్నాడు బ్రూక్. హార్వర్డ్ ప్రొఫెసర్ ఆర్థర్ సి.బ్రూక్‌కి హ్యాపీ సైంటిస్ట్ అని పేరు.

తొలి అడుగు





ఫస్ట్ క్లాస్ జర్నీ

కాస్త సరదాగా చెప్పుకోవాలంటే...
‘నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు’ అనే ఆరుద్ర మాట సురేఖ యాదవ్‌కు వర్తించదు.
నిజానికి రైలే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.
ఆసియా ఫస్ట్ ఉమెన్ ట్రైన్ డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన సురేఖ రిటైర్ అయింది.
ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి. భావితరాలకు మార్గదర్శకాలు ఉన్నాయి.

మహారాష్ట్రలోని సతారలో పుట్టి పెరిగింది సురేఖ. అయిదు గురు పిల్లల్లో పెద్దది. తండ్రి రామచంద్ర భోంస్లే రైతు. సతారాలోని సెయింట్ పాల్ కాన్వెంట్ హైస్కూలులో చదువుకున్న సురేఖ వృత్తివిద్యా కోర్సులో చేరింది. ఆ తరువాత.. కరాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్), బీయీడీ చేసింది.

టీచర్ కాదు రైలు డ్రైవర్

బీయీడీ చేసిన సురేఖ టీచర్ కావాలనుకునేది. అయితే ఆమెకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. ముంబైలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసుకొని సెంట్రల్ రైల్వేస్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరింది. 1985లో కల్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆరు నేలల పాటు శిక్షణ తీసుకుంది. అసిస్టెంట్ డ్రైవర్‌గా ఆమె వృత్తి ప్రయాణం మొదలైంది. వాడి బందర్, కల్యాణ్‌ల మధ్య నడిచే గూడ్స్ ట్రైన్‌లో ఇంజిన్ రన్నింగ్ కండీషన్, సిగ్నల్స్... మొదలైన వాటిని పర్యవేక్షించేది. కొన్ని సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో గూడ్స్ డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆ తరువాత వెస్ట్రన్ ఘాట్ రైల్వేస్‌లో డ్రైవర్‌గా పనిచేసింది.

■ దక్కన్ క్వీన్ డ్రైవ్ చేసిన క్వీన్

దక్కన్ క్వీన్(డైలీ పాసింజర్ ట్రైన్) డ్రైవర్‌గా పాసింజర్ ట్రైన్‌ను నడిపిన ఆసియాలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది సురేఖ. ఘాట్ లైన్ కోసం రెండు-ఇంజిన్‌ల ప్యాసింజర్ ట్రైన్ నడపడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గతంలో మహిళలు ఎవరూ ఘాట్ లైన్‌లో ట్రెయిన్ నడపక పోవడం వల్ల పై అధికారులకు సందేహాలు ఉండేవి. వాటిని పటాపంచలు చేస్తూ ‘శభాష్’ అనిపించుకుంది సురేఖ.

‘దక్కన్ క్వీన్ ట్రైన్ నడపాలనేది నా కలగా ఉండేది. ఎందుకంటే మహిళ పేరుతో నడిచే రైలు అది. ఆ పేరులో రాజసం ధ్వనిస్తుంది. ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. భారతీయ రైల్వే నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గర్వంగా ఉంది. మహిళలకు ప్రత్యేకించిన ట్రైన్స్‌ను నడపడం కూడా సంతోషంగా ఉంది’ అంటుంది సురేఖ.

■ గురువుగా...

ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా 2011లో ప్రమోట్ అయిన సురేఖ ఆ తరువాత కల్యాణ్‌లో డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్ (డిటీసి)లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పాఠాలు బోధించింది. మన దేశంలో ట్రైన్ నడిపిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్న సురేఖ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చింది. 2011లో 50 మంది మహిళలు సబర్బన్, గూడ్స్ ట్రైన్ డ్రైవర్లుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఇలాంటి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి...సురేఖ.

■ ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై...

‘ఆడవాళ్ల ట్రైన్ డ్రైవర్ ఏమిటి! అని ఆశ్చర్యపోయే రోజుల్లో కూడా నా కుటుంబం, మిత్రులు, బంధువుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై నన్ను ముందుకు నడిపించింది. వృత్తిజీవితంలో నాకు ఎలాంటి వివక్షా ఎదురుకాలేదు. ట్రైన్ ఎక్కిన తొలి క్షణం నుంచి మరే విషయాలు మదిలో రాకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని’ అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది సురేఖ.

నిజానికి ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఆ ఉద్యోగమే ఆమెను చరిత్రలో గుర్తింపు తెచ్చుకునేలా చేసింది.

కష్టం లేదు... ఎప్పుడూ ఇష్టమే!

‘ట్రైయిన్ నడపడం అంటే మాటలా!’లాంటి మాటలు వినిపించినప్పటికీ నేను ఎప్పుడూ భయపడలేదు. చాలా ధైర్యంగా, ఉత్సాహంగా శిక్షణ తీసుకున్నాను. ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చానా అని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కుటుంబ, వృత్తి బాధ్యతలను జాగ్రత్తగా సమన్వయం చేసుకునేదాన్ని.

– సురేఖ యాదవ్



ఘనమైన వీడ్కోలు

సురేఖ యాదవ్ ఫేర్‌వెల్ సెలబ్రేషన్ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ)లో ఘనంగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సురేఖ ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు, రైల్వే ఉద్యోగులు ఆమె మెడలో పూలమాలలు వేశారు. డోళ్లు వాయిస్తూ నృత్యాలు చేశారు.

‘సురేఖ రిటైర్ అయినప్పటికీ... ఆమెలోని శక్తి సామర్థ్యాలు రిటైర్ కావు. అవి ఎప్పుడూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి’ అన్నారు వక్తలు.

రీబూట్

స్టైల్ మార్చి సత్తా చాటింది!



వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన జైస్మిన్ లంబోరియా ప్రయాణం నల్లేరు మీద నడకేమీ కాదు. హరియాణాకు చెందిన జైస్మిన్ కుటుంబాన్ని ‘బాక్సర్‌ల కుటుంబం’ అంటుంటారు. ఆమె తాత కెప్టెన్ చందర్ బ్యాన్ లంబోరియా రెజ్లర్. బాబాయ్‌లు నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్స్‌గా సత్తా చాటారు. తాతల బాక్సింగ్ నైపుణ్యాల గురించి వింటూ, బాబాయ్‌ల బాక్సింగ్‌ల ప్రతిభను చూస్తూ పెరిగింది జైస్మిన్.

వారి స్ఫూర్తితో బాక్సింగ్‌లోకి అడుగు పెట్టిన జైస్మిన్ తన బుుఎత్తు కారణంగా మొదట్లో ఇబ్బంది పడింది. అపజయాలు పలకరించాయి. ‘అపజయాన్ని చూసి బాధపడడం కంటే ఆడేవిధానాన్ని మార్చుకుంటే సరిపోతుంది’ అని ధైర్యం చెప్పుకొని తన స్టైల్‌ను మార్చుకుంది. ఆ మార్పులలో అతిగా తొందర పడకుండా ఓపికగా ఉండడం కూడా ఒకటి. కొత్త స్టైల్‌తో బంగారు పతకం గెలుచుకుంది.

బ్రెజిల్‌లో జరిగిన ‘వరల్డ్ బాక్సింగ్ కప్’కు జైస్మిన్‌ను పంపడానికి నిరాకరించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం స్వర్ణపతకం గెలిచిన సందర్భంగా ‘ప్రౌడ్ మూమెంట్ ఫర్ ఇండియా’ అంటూ ‘ఎక్స్’ వేదికగా ఎక్సలెంట్ టెక్నికల్ బాక్సర్ జైస్మిన్ లంబోరియాను ప్రశంసించడం విశేషం.

వంటిల్లు

అమ్మకు నైవేద్యం



దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా- అనే ఆందోళన తలెత్తడమూ సహజం... ఏమేం కావాలి, ఎలా రెడీ చేసుకోవాలో ముందే తెలుసుకుని, ఆచరణలో పెడితే అమ్మవారికి రుచిగా... శుచిగా నైవేద్యాలను సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. ఆ వివరాలు ఈ వారం వంటిల్లులో..

పరమాన్నం



కావలసినవి: పెసరపప్పు – 1/2 కప్పు; బియ్యం – 3/4 కప్పు; పాలు – కప్పు; నీళ్లు – 4 కప్పులు; బెల్లం తరుగు – కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు – పది పలుకులు; కిస్‌మిస్ – గుప్పెడు.

తయారీ: ● పప్పును దోరగా వేయించుకోవాలి ● బియ్యం, పప్పు కలిసి కడగాలి ● కుకర్‌లో కడిగిన బియ్యం, పప్పు, నీళ్లు కలిపి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించి, దించాలి ● మందపాటి గిన్నెలో బెల్లం తరుగు వేసి వేడిచేయాలి. దీంతో 3–4 నిమిషాల్లో బెల్లం పాకం సిద్ధం అవుతుంది ● కుకర్ విజిల్ వచ్చాక మూత తీసి, అన్నం మెత్తగా స్పూన్‌తో మెదుపుకోవాలి. పాలు పోసి కలపాలి ● ఫిల్టర్ పెట్టి, బెల్లం సిరప్ వడకట్టి, మెత్తగా అయిన అన్నంలో కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి కలపాలి ● విడిగా మరొక మూకుడులో నెయ్యి వేడి చేసి, దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించాలి ● నెయ్యిలో వేయించిన జీడిపప్పు మిశ్రమంలో కలిపి, గిన్నెలోకి తీసుకోవాలి.

అల్లం గారెలు



కావలసినవి: మినప్పప్పు – కప్పు; ఉప్పు – 1/3 టీ స్పూన్ (తగినంత); వంట సోడా– చిటికెడు; పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మినప్పప్పు కడిగి, 3–4 గంటలసేపు నానబెట్టాలి. నీళ్ల వడకట్టి, ఉప్పు వేసి, మెత్తగా రుబ్బుకోవాలి ● రుబ్బిన పిండిలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాలపొడి, కరివేపాకు తరుగు వేసి కలపాలి ● స్టౌ పై కడాయి పెట్టి, గారెలు వేయించడానికి తగినంత నూనె పోసి, వేడి చేయాలి ● వేళ్లకు నీళ్ల తగిలేలా తడి చేసుకొని, పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని, వేళ్లతోనే బాల్స్‌లా చేసుకోవాలి ● నూనె రాసిన ప్లాస్టిక్ షీట్‌పైన పిండి బాల్‌ను కొద్దిగా వేళ్లతో అదిమి, మధ్యలో హోల్ పెట్టాలి ● తయారు చేసుకున్న దానిని కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు ఉంచి, బయటకు తీసి, ప్లేటులో పెట్టాలి.

కదంబం



కావలసినవి: బియ్యం – కప్పు; కందిపప్పు – అర కప్పు; చింతపండు – నిమ్మకాయ పరిమాణం; కూరగాయలు – బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, బెండకాయ, దొండకాయ, గాజర్, బఠానీ.. మొదలైనవి – 150 గ్రాములు (చిన్న ముక్కలు); పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – తగినంత; సాంబార్ పొడి – 2 టీ స్పూన్లు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువు – చిటికెడు; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● కందిపప్పు బాగా ఉడికించి, మెత్తగా మెదిపి పక్కనుంచాలి ● మరొక గిన్నెలో బియ్యం మెత్తగా ఉడికించి, వేరుగా ఉంచాలి ● ఒక గిన్నెలో కూరగాయల ముక్కలు, చింతపండు రసం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కూరగాయ ముక్కల్లో సాంబార్ పొడి వేసి బాగా కలపాలి ● మెత్తగా చేసిన పప్పు, అన్నం ఉడుకుతున్న కూరగాయల మిశ్రమంలో వేసి కలపాలి ● ఒక చిన్న పాన్‌లో నూనె వేసి వేడి చేసి, ఆవాలు, జీలకర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసిన తాలింపును వేసి కలపాలి.

● గిన్నెలోకి తీసిన తర్వాత చివరగా నెయ్యి వేయాలి.



– నారాయణమ్మ, మీ థాట్ హోమ్ డిలైట్

● సోషల్ మీడియా



తూమక్ తూమక్

సోషల్ మీడియాలో ‘తూమక్ తూమక్’ అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది. కర్మ అనే టీచర్ చిన్న పిల్లలతో కలిసి వేసిన ‘తూమక్ డ్యాన్స్’ ఆహా అనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 21 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



టీచర్ వేసిన పాపులర్ ట్రెండ్ స్టెప్స్‌ను చిన్ని స్టూడెంట్స్ పర్‌ఫెక్ట్‌గా అనుసరించి ‘వారేవా’ అనిపించారు.

‘మీరు నమ్ముతారో లేదోగానీ నేను ఈ వీడియోను వంద సార్లు చూసి ఉంటాను’ అన్నాడు ఒక యూజర్.

‘నా వయసు 26 సంవత్సరాలు. మీ స్కూల్‌లో విద్యార్థిగా మారవచ్చా?’ అని సరదాగా అడిగింది ఒక యూజర్.

ప్లేబ్యాక్ సింగర్ నేహా బాషిన్ ‘జుట్టి మేరీ’ ఆల్బమ్ పాపులర్ అయింది. ఈ పాటలోని తూమక్ స్టెప్స్‌కు ఆన్‌లైన్ లోకం ఫిదా అయింది. గతవారం క్లాస్‌రూమ్‌లో చిన్న అమ్మాయి ఒకరు చక్కని హావభావాలతో వేసిన తూమక్ తూమక్ స్టెప్స్ వీడియో కూడా వైరల్ అయింది.

● నమిత

పట్టుదలే..ముందడుగు





ఢిల్లీలో మెటల్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేసిన నమిత సూరత్‌లో ఎనిమిదేళ్లు ఆభరణాలను డిజైన్ చేసింది. అయితే ఉన్నట్లుండి ఆమె విజయవంతమైన కెరీర్‌ను వదిలి హైదరాబాద్‌కు మారి సామాజిక, పారిశుధ్య సమస్యలపై అవగాహన పెంచుకొని పర్యావరణం కోసం పనిచేస్తోంది. రైల్వేలతో పాటు దేశంలో శానిటేషన్ అవసరం ఉన్న ప్రాంతాలలో బయో డైజెస్టర్ టాయిలెట్‌లను నిర్మించి పారిశుధ్య కార్మికులు, గ్రామీణ మహిళలకు వందలాది ఉద్యోగాలను సృష్టించింది. పర్యావరణం కోసం పనిచేయడానికి ఆసక్తి చూపే అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల్లో పాల్గొంది. హెల్త్ కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతోపాటు అనేక ప్రశంసలను పొందిన నమిత బంకా కథ ఇది.

‘తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను’ అంటారు నమిత. భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఇక్కడే సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వివిధ కోర్సుల్లో చేరారు. దాంట్లో భాగంగా ఇండియన్ రైల్వేలో టెండర్లు వేయడం మొదలుపెట్టారు. తనకున్న పరిచయాల ద్వారా పెద్ద సమస్యలలో ఒకటైన పారిశుధ్యం గురించి తెలుసుకుని, రైల్వేలో టాయిలెట్ తయారీదారులకు లైసెన్సింగ్ ఏజెంట్‌గా పనిచేసి, మార్కెట్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఎమ్ఎస్ఎమ్ఇ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పరిచి, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో రాణిస్తున్నారు. బంకా బయో ప్రైవేట్ లిమిటెడ్‌కు రూపకల్పన చేసి, దానిని సంస్థాగతంగా వెలుగులోకి తీసుకువచ్చారు.

వ్యర్థాల శుద్ధి

మన దేశంలో పారిశుధ్య సమస్యల గురించి నమిత వివరిస్తూ –‘‘గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బహిరంగంగా మలవిసర్జన చేస్తుంటారు. ఈ పద్ధతి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. పర్యావరణ సమస్యలను పెంచుతుంది. నీటి కాలుష్యానికి దారితీస్తుంది. మేం టాయిలెట్‌ను మాత్రమే కాకుండా ‘ఆన్-సైట్’ వ్యర్థాల శుద్ధి సౌకర్యాన్ని కూడా అందిస్తాం. వీటి ట్యాంక్‌లో బయో–డైజెస్టర్‌లు అమర్చి ఉంటాయి. సంప్రదాయ టాయిలెట్‌లతో పోలిస్తే తక్కువ సమయంలో 99 శాతం వ్యర్థాలు కుళ్ళిపోతాయి. సంప్రదాయ సెప్టిక్ ట్యాంకులను బయో–ట్యాంకులుగా మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. ఇది మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్య పరిస్థితులను సృష్టిస్తుంది. రైలు పట్టాలను వ్యర్థ పదార్థ రహిత ట్రాక్‌లుగా మార్చడానికి భారతీయ రైల్వేలకు, కుటుంబాలకు బయో–టాయిలెట్లు, పబ్లిక్– కమ్యూనిటీ, పాఠశాలలు, సంస్థలకు బయో–టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న సెప్టిక్ ట్యాంకులను బయో–ట్యాంకులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సమాజంలో పారిశుధ్యం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితి గురించి నాకు తెలుసు. మొదట ఈ విషయంలో రైల్వే అధికారులను సంప్రదించినప్పుడు, రైళ్లలో టాయిలెట్ టెక్నాలజీలను మెరుగుపరచడంలో వారు నాతో సహకరించారు. పారిశుధ్య ప్రమాణాలను పెంచడానికి అక్కడ ఒక బలమైన అవకాశాన్ని చూశాను. తరువాత సమాజం కోసం కూడా దీనిని ఉపయోగించడం ప్రారంభించాను.

ధైర్యంతో పాటు దృఢ సంకల్పమే తోడు

కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంతో పాటు తలపెట్టిన పని పూర్తిచేయాలనే దృఢ సంకల్పం ఉండాలి. నేను అదే చేశాను. సాంస్కృతిక అడ్డంకులెన్నో నాకు అడ్డంకిగా నిలిచాయి కానీ ఆగిపోలేదు. సమాజం పట్ల నా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్న నా సంకల్పం, పారిశుధ్యం, పర్యావరణం పట్ల శ్రద్ధే నన్ను నడిపిస్తున్నాయి. ఔత్సాహిక బృందం నాతో కలిసి రావడం అదృష్టం. మొదట ముగ్గురు సభ్యులతో మొదలుపెట్టాం. 2013 చివరి నాటికి మా సంఖ్య 80కి పెరిగింది. వివిధ విభాగాలతో ఖర్చుతో కూడుకున్న పారిశుధ్య పరిష్కారాలను అందించడానికి కృషి చేస్తున్నాం. సంకల్ప్ సమ్మిట్, యాక్షన్ ఫర్ ఇండియా వంటి కార్యక్రమాలలో పాల్గొన్నాం. అక్కడి అనుభవాలు మమ్మల్ని మేము మరింతగా మెరుగుపరచుకోవడానికి సహాయపడ్డాయి. దీనికితోడు బ్యాంకు క్రెడిట్, ప్రైవేట్ రుణ నిధులు ఉండనే ఉన్నాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రయోజనాలను అందించింది. ఒక మహిళా వ్యవస్థాపకురాలిగా ప్రతి దశలోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. రకరకాల సామాజిక మనస్తత్వాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే సక్సెస్ సాధించగలుగుతాం’’ అని చెప్పారు నమిత.

దేశంలో టాయిలెట్ సౌకర్యం అందుబాటులో లేని ప్రదేశాలలో బయోడైజెస్టర్ టాయిలెట్ల నిర్మాణానికి, తయారీకి, సరఫరాకు నమిత బంకా కృషి చేస్తున్నారు. దాదాపు పది మిలియన్ల మందికి ఆమె సేవలు చేరుకున్నాయి. ఇండియన్ రైల్వేస్, షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టి, వోకార్డ్ ఫౌండేషన్, తెలంగాణ, ఎ.పి ఎడ్యుకేషన్ – వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇస్రో .. వంటివి బంకా బయోకు ఉన్న ముఖ్యమైన క్లయింట్లు. ఈ కంపెనీ ప్రతిష్ఠాత్మక సంకల్ప్ హెల్త్‌కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది.

● పునరాగమనం



5000 ఏళ్లనాటి ఆట తిరిగి వచ్చింది!

5000 వేల ఏళ్ల క్రితం నాటి ఆట ఒకటి తమిళనాడులో పునరాగమనం చేయడమే కాదు బాగా పాపులర్ అవుతోంది. చోళుల కాలం నాటి ఈ ఆట పేరు... ఆట్య పట్య. శారీరక దారుఢ్యం, ఐక్యతకు అద్దం పట్టే ఈ ఆటను ‘నత్రినై’ అని కూడా పిలుస్తారు. తమిళ ప్రాచీన సాహిత్యంలో ఈ ఆటకు సంబంధించిన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

పదిహేనుమందితో రెండు జట్లు ఆడే ఈ ఆట చురుకుదనం, వ్యూహం, క్రమశిక్షణకి గీటురాయిగా నిలిచింది.

పెద్దల నోటి నుంచి ఆట్య పట్య గురించి విన్న యువతరం వేల ఏళ్ల నాటి ఆటకు ప్రాణం పోశారు. తమిళనాడులోని వివిధ జిల్లాలలో యువతరమే కాదు పిల్లలు కూడా ఆట్య పట్య ఆడుతున్నారు. ఈ ఆట ఎలా ఆడాలి అనేదాని గురించి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 19న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,14,410	1,13,500	1,11,330	1,13,500	1,14,050	1,11,600
బంగారం (22 క్యారెట్లు)	1,07,560	1,02,050	1,02,050	1,05,110	1,04,930	1,02,300
వెండి	1,33,500	1,33,800	1,43,000	1,33,800	1,33,300	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.